విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 31, మార్చి 2023

కుట్రతోనే ప్రాజెక్టు ఎత్తును తగ్గించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కయ్యాయి

- ప్రాజెక్టు నిర్మాణం పై ఎగువ దిగువ సభల్లో వైసీపీ పూటకొక మాట
- ఏప్రిల్ 1న కమ్మభవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం
- సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

విశాలాంధ్ర - అనంతపురం అర్బన్ : పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఎగువ దిగువ సభల్లో ఎంపిలు పూటకో మాట మాట్లాడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ విమర్శించారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖర రెడ్డిభవన్‌లో ఆపార్టీ నాయకులతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం తగ్గించాలనే కుట్రతోనే ప్రాజెక్టు ఎత్తును తగ్గించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కయ్యాయని మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు 41.15 మీటర్ల ఎత్తు ఉండేలా నిర్మిస్తామని వైసీపీ ఎంపిలు పార్లమెంటులో చెబుతూనే మరోవైపు 45.72 మీటర్లు నిర్మిస్తామని రాజ్యసభలో చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం చట్టసభల్లో సమయం వెచ్చించాల్సిన ఎంపిలు పూటకొక మాట మాట్లాడటం బాధాకరమన్నారు. రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైన ఎగువ దిగువ సభలంటే వైసిపి ఎంపీలకు లెక్కలేకుండా పోయిందని విరుచుకు పడ్డారు. పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన అనంతరం నిర్దేశించిన విధంగా నిర్మాణం 156 అడుగుల ఎత్తుతో 196 టిఎంసిల నీరు నిల్వ ఉండేలా త్వరితగతిన నిర్మించాలని డిమాండ్ చేశారు. కేవలం 92 టిఎంసిలకే కుదించే దుర్మార్గమైన ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని అయితే ఈ విషయం పై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నోరు మెదపకుండా ఉన్నాడని ఘాటుగా వ్యాఖ్యానించారు. సీఎం జగన్ తనపై ఉన్న ఈడి కేసులు, బాబాయ్ వివేకా హత్య కేసు కు భయపడే కేంద్రానికి దాసోహమంటున్నాడని తూర్పార బాట్టారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం అంగుళం కూడా తగ్గించబోమని రాజ్యసభ సాక్షిగా చెబుతున్న వైసీపీ ఎంపిలు అందుకు కావలసిన బడ్జెట్ ఎలా తెస్తారో రాష్ట్ర ప్రజలకు చెప్పాలని సీపీఐ జాఫర్ సవాల్ విసిరారు. పోలవరం నిర్మాణానికి 55 వేల 548 కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉందని అయితే ఇరిగేషన్ ప్రాజెక్టులకు కేవలం 47 వేల 724 కోట్లు మాత్రమే కేటాయించి వాటిని సైతం ఖర్చు పెట్టే పరిస్థితి కనబడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరిగితే 7.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే కాకుండా విశాఖ పారిశ్రామిక అవసరాలకు 24 టిఎంసిలు, కుడి ఎడమ కాలువల ద్వారా 534 గ్రామాలకు త్రాగు నీరు అందించేదుకు వెసులు బాటు ఉంటుందని స్పష్టం చేశారు. రాయలసీమ లోని హంద్రీ నీవా, గాలేరు నగరి ప్రాజెక్టులకు సైతం పుష్కలంగా నీరు అందుతుందన్నారు. ఇలాంటి బహుళార్థక ప్రాజెక్టును అటు బిజెపి, ఇటు వైసీపీ ప్రభుత్వాలు నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నాయని దుమ్మెత్తి పోశారు. సీఎం జగన్ తమపై ఉన్న కేసులనుండి తప్పించుకునేందుకే ఢిల్లీకి వెళ్తున్నాడని రాష్ట్ర ప్రయోజనాలకోసం కాదని విరుచుకు పడ్డారు. కర్ణాటకలో అప్పర్ భద్రా జాతీయ ప్రాజెక్టు కాకపోయినా ఎన్నికల వ్యూహంలో భాగంగా 5 వేల 3 వందల కోట్లు బడ్జెట్ కేటాయించారని నిప్పులు చెరిగారు. అప్పర్ భద్రా నిర్మాణం జరిగితే రాయలసీమ జిల్లాల్లో రెండున్నర లక్షల ఎకరాల ఆయకట్టు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుందని పాలక ప్రభుత్వాలు సీమ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పర్ భద్రా నిర్మాణం తో రాయలసీమ జిల్లాలు ఎడారిగా మారే ప్రమాదం ఉందని అదే జరిగితే ప్రజాప్రతినిధులను ప్రజా కోర్టులో నిలదీస్తామని హెచ్చరించారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి స్థాయిలో నిర్మించాలని అప్పర్ భద్రా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ విషయం పై ఏప్రిల్ 1న అన్ని రాజకీయ పార్టీలు రైతు, వ్యవసాయ, ప్రజా, కార్మిక సంఘాల ప్రతి నిధులతో జిల్లా కేంద్రంలోని కమ్మభవన్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్,తెలుగు దేశం పార్టీకి చెందిన మాజీ నీటి పారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వర్రావ్, మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, ఇతర వామపక్ష పార్టీల నాయకులు హాజరు కానున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి, కార్యవర్గ సభ్యులు రాజారెడ్డి, శ్రీరాములు కేశవ రెడ్డి,లింగమయ్య, సంతోష్ కుమార్, రాజేష్ గౌడ్ పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శి కామ్రేడ్ వెంకటేష్ గుండెపోటుతో మృతి

- నివాళులర్పించిన సీపీఐ, పలువురు,నాయకులు

విశాలాంధ్ర - యాడికి : సీపీఐ మండల కార్యదర్శి కామ్రేడ్ వెంకటేష్ గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో ఆకస్మిక మృతి చెందారు. మండలకేంద్రంలో గత 13 సంవత్సరాల నుండి సీపీఐ మండల కార్యదర్శిగా నిరంతరం నిరుపేద, బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలబడి నిరంతరం పేద ప్రజలు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుండేవారు. వెంకటేష్‌కు బుధవారం మధ్యాహ్నం చాతిలో నొప్పి రావడంతో తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో ప్రథమ చికిత్స చేయించుకొని అక్కడినుండి మెరుగైన వైద్యం కోసం అనంతపురం సవేరా హాస్పిటల్ లో చేరారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం తెలుసకున్న సీపీఐ జిల్లా, మండలాల నాయకులు యాడికిలో వెంకటేష్ నివాసం చేరుకొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, ఏఐటియు సి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, సీపీఐ సీనియర్ నాయకులు సూర్యనారాయణ రెడ్డి, గేట్స్ కాలేజీ యాజమాన్యం పద్మావతమ్మ, వికె విశ్వనాథ్ రెడ్డి, వికె ప్రదీప్ రెడ్డి,క్లాస్ వన్ కాంట్రాక్టర్ చవ్వాగోపాలరెడ్డి, సీపీఐ సీనియర్ నాయకులు లక్ష్మయ్య, సీపీఐగుంతకల్ నియోజకవర్గ కార్యదర్శి విరభద్రస్వామి, సీపీఐ మండల కార్యదర్శి రాము,వైసీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉపసర్పంచ్ కాస చంద్రమోహన్, సీపీఐ తాడిపత్రి నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, సీనియర్ నాయకులు నాగిరెడ్డి, శ్రీరాములు, గరిడి శివన్న,తాడిపత్రి టౌన్ కార్యదర్శి గంగరాజు, మాజీ ఎంపీపీ రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు,టీడీపీ నాయకులు గండికోట లక్ష్మణ్, బద్దెల రాముడు, పెద్దవడుగురు మండల కార్యదర్శి వెంకట రాముడుయాదవ్, గుత్తి మండల కార్యదర్శి రామ దాసు, జూటూరు బ్రదర్స్ రఫీ, రాజాక్, అనిఫ్, రబ్బానీ, తదితరులు వెంకటేష్ పార్థి వదేహానికి నివాళులు అర్పిం చారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకటేష్‌కు భార్య ముగ్గురు కుమారులు ఉన్నారు.

సొంత నిధులతో సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర-రాయదుర్గం : సొంత నిధులతో సేవా కార్యక్రమంలో చేపడుతూ ప్రజలు ఆకట్టుకుంటూ కాపు రామచంద్రారెడ్డి పై లేనిపోని ఆరోపణలు చెయ్యడం నీకు తగునా అంటూ వ్యవసాయ కమిటీ మార్కెట్ యార్డ్ చైర్మన్ భోజరాజు నాయక్ పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలవ శ్రీనివాసులకు ఈ మధ్యకాలంలో పిచ్చి నెత్తికెక్కింది. నోటి దురుసు మరీ పెరిగిందని విమర్శించారు. మతి పూర్తిగా భ్రమించింది కాబట్టి కాపు రామచంద్రారెడ్డి పైన లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. కాపు రామచంద్రారెడ్డి ప్రతిచోటా కష్టాల్లో ఉన్న వాళ్ళకి తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. తన సొంత నిధులతో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాపు రామచంద్రారెడ్డికి డబ్బులు సంపాదనపైనే వ్యామోహం ఉండి ఉంటే ఇప్పటికీ కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఉచిత వివాహాలు, వికలాంగులకు మూడు చక్రాల సైకిళ్లు, అక్కచెల్లెళ్లకు ఒడి బియ్యం కార్యక్రమం, ఉచిత కంటి చికిత్సా శిబిరాలు, అన్నదానాలు, యువతకు ఆటల పోటీలు, వందలాది దేవాలయాలకు కోట్లాది రూపాయలు విరాళాలు లాంటి ధర్మకార్యాలు చేసేవాడా? అని గుర్తు చేశారు. కాలవా ! గుర్తుంచుకో ఏ రోజు కానీ, ఎక్కడైనా గాని అవినీతికి పాల్పడవలసిన అవసరం కాపు రామచంద్రారెడ్డి రాలేదు, ఎప్పటికీ రాదు అని అన్నారు. గతంలో కాలువ శ్రీనివాసులు అధికారంలో ఉన్నప్పుడు రేషన్ కార్డు దగ్గర నుండి, పెన్షన్ ల నుండి ఇళ్ల పట్టాల వరకు జన్మభూమి కమిటీల ద్వారా మామూళ్ళు వసూలు చేసిన ఘనత నీది అన్నారు. ఎన్నో రకాల నీతిలేని అక్రమ దందాలు చేసి దండుకొని ఈరోజు నట ప్రదర్శన చేస్తున్నారన్నారు. ఇష్టారాజ్యంగా దోపిడీ దందాలు చేసి ఇతరులపై నింద వేయడం ఎంతవరకు సమంజసం. అని అన్నారు తిరుపతి దర్శనానికి ఇచ్చే సిఫారసు లెటర్ లు కూడా ఐదు వందలు రూపాయలకు అమ్ముకున్న నీచ చరిత్ర శ్రీనివాసులు, దేవుని గుడిలో హారతి పళ్ళెం లోకి వేసే దక్షిణం కూడా నీ పార్టీ కార్యకర్తలతో తీసుకున్న చరిత్ర అని ఆవేదన వ్యక్తం చేశారు. నీతి నిజాయితీ గురించి నీవు మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టే ఉంటుంది. ఎక్కడైనా ఎవరైనా ఏ విషయానికైనా లంచాలు అడిగితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, లేకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని, అవసరమైతే అవినీతి ఆరోపణలకు సంబంధించిన ఫోన్ నెంబర్ కు ఫోన్ చేయాలని ప్రజలకు తెలియజేసిన వ్యక్తి కాపు రామచంద్రారెడ్డి అలాంటి వ్యక్తిపై ఆరోపణలు చేయడం కాలువ శ్రీనివాసులు యొక్క నీచత్వానికి పరాకాష్ట. నీ మోసపు మాటలు నమ్మే వాళ్ళు ఇక్కడ ఎవ్వరూ లేరు, నీవు ప్రతి విషయాన్ని రాజకీయ లబ్ధికి వాడుకునేలా అసత్యపు ఆరోపణలు చేస్తే అంటించాలని చూస్తే ప్రజలు నీకు గుణపాఠం చెప్పడానికి రాయదుర్గం ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు.

మహిళ హత్య కేసును రెండు గంటల్లో ఛేదించిన నాలుగో పట్టణ పోలీసులు

విశాలాంధ్రబ్యూరో - అనంతపురం : అనంతపురంలోని ఆజాద్ నగర్‌లో నివాసముంటున్న ఇస్మాయిల్ భార్య సర్దార్‌బి(57) బుధవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయం ంలో హత్యకు గురైంది. ఇస్మాయిల్ భార్యతో పాటు కొడుకు భాష, కోడలు ఉమెర సుల్తానా,మనవరాళ్లు ఇద్దరు ఉండేవారు. బుధవారం రాత్రి సర్దార్ బి హత్యకు గురైందని కోడలు ఉమెర సుల్తానా ఉదయం 2గంట లకు సమాచారం ఇవ్వగా వెంటనే అతను సంఘటన స్థలానికి వచ్చి వారి ఇంటిలో తన తల్లిని ఎవరో గుర్తుకు తెలియని దుండగులు హత్య చేసి బంగారు ఆభరణము లను దొంగలించుకుని వెళ్లారని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకోగా ఇంటి లో దొంగతనానికి వచ్చిన వ్యక్తి తమ అత్తను చంపాడని ఉమెర సుల్తానా పోలీసులకు తెలిపింది. అయితే హత్యాపై అనుమానం వచ్చిన పోలీసులు... జిల్లా ఎస్పీ డాక్టర్. ఫక్కీరప్ప ఆదేశాల మేరకు డిఎస్పీ ఆర్ల శ్రీనివాసులు సూచనలు మేరకు కేసు నమోదు చేసుకొని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ జాకీర్ హుస్సేన్ ఖాన్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో విచార ణలో భాగంగా కుటుంబ సభ్యులను, ఆ స్థలంలోని ఆధారాలను బట్టి, సాంకేతిక ఆధారాల ద్వారా అసలు విషయం వెలుగు చూసింది. సర్దార్ బి కొడుకు భాషకు గుంతకల్‌కి చెందిన ఉమేర సుల్తానాతో 2018సంవత్స రంలో వివాహం జరిగింది. సర్దార్ బికి ఉమేర సుల్తానా ఇంటికి కోడలుగా రావడం ఇష్టంలేదు, ఉమేర సుల్తానాను చీటికిమాటికి సూటిపూటి మాటలతో ఇబ్బం దులకు గురి చేసేది. సర్దార్ బి పెట్టే బాధలు తట్టుకోలేక ఉమేర సుల్తానా ఆత్మహత్య చేసుకోవాలని తన తమ్ముడైన గుంతకల్లుకు చెందిన హెూస్నూర్ వలితో చెప్పి బాధపడింది. హెూంస్నూర్ వలి నువ్వు ఎందుకు చనిపోతావ్ నేనే మీ అత్తను చంపుతానని పథకం వేశారు. నిన్నటి రాత్రి ఇంటిలో తన మామ, భర్త పని నిమిత్తం బయటకు వెళ్లడంతో తమ్ముడికి సమాచారం అందించింది. దీంతో గుంతకల్లు నుంచి వచ్చిన హెూస్నూరు వలి అర్ధరాత్రి సమయంలో సర్దార్ బిని ఒక వైరు సహాయంతో గొంతు బిగించి చంపినట్లు విచారణలో వెలుగు చూసిందని సీఐ జాకీర్ హుస్సేన్ ఖాన్ తెలిపారు. చట్ట ప్రకారం వీరిద్దరి బుధవారం సాయంత్రం ఐదు గంటలకు అనంతపురం రుద్రంపేట సమీపంలోని కెఎఫ్సి ముందర ముద్దాయిలైన హుమేరా సుల్తానా,హెూస్నూరు వలిని అరెస్టు చేసి, వారి నుండి బజాజ్ డిస్కవరీ ద్విచక్ర వాహనమును, సుమారు రెండు మీటర్ల పొడవు ఉన్న వైరును,రెండు సెల్ ఫోన్లను , కొంత బంగారు పెద్దమనుషుల సమక్షంలో స్వాధీనం చేసుకొని గురువారంరిమాండ్‌కు పంపుతున్నామని చెప్పారు.రెండు గంటల్లో కేసును చేదించిన డీఎస్పీ ఏ. శ్రీనివాసులు, సీఐలు జాకీర్ హుస్సేన్ ఖాన్, విజయ భాస్కర్‌గౌడ్, కత్తి శ్రీనివాసులు, ఎస్ ఐ గంగాధర్, చంద్ర శేఖర్, జయపాల్, టెక్నికల్ ఎస్ఐ సుధాకర్, అనంత పురం నాలుగో పట్టణం పోలీస్ స్టేషన్ సిబ్బందిని, గుంతకల్ రూరల్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్, వారి సిబ్బందిని, క్లూస్ టీం ఎస్ఐ అనిల్ వారి సిబ్బందిని డాగ్ స్క్వాడ్‌సిబ్బందిని ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప అభినందించారు.

కామ్రేడ్ వీకే వెంకటరమణారెడ్డికి ఘన నివాళులు

విశాలాంధ్ర-గుంతకల్లు : స్వతంత్ర ఉద్యమంలో కీలకంగా ఎనలేని పోరాటాలు చేస్తూ ప్రజా సమస్యలపై గళం విప్పుతూ నేటి తరం కమ్యూనిస్టులకు ఆదర్శమైన ఆయన కమ్యునిస్టు పార్టీ బలోపేతానికి కృషి చేసిన సీకే ఆదినారాయణ రెడ్డి సోదరుడు వీకే వెంకటరమణారెడ్డి మృతి చెందడం చాలా బాధాకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీష్ అన్నారు గురువారం వేములపాడు గ్రామంలో ఆయన నివాసంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గశూ సభ్యులు డి.జగదీష్, సిపిఐ జిల్లా కార్యవర్గం సభ్యులు వీరభద్రస్వామి,జిల్లా కౌన్సిల్ సభ్యులు రాము రాయల్ లు కుటుంబ సభ్యులను పరామర్శించి అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సంధర్భంగా డి.జగదీష్ మాట్లాడుతూ...స్వతంత్ర ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేసిన వి.కే. వెంకటరమణారెడ్డి మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన మృతికి రెడ్ సెల్యూట్ చేస్తూ ఉద్యమకారుడికి జోహార్లు అని తెలిపారు. రాబోయే తరాల కమ్యునిస్టులకు ఆయన ఆదర్శమని తెలిపారు. సిపిఐ నాయకులు రామదాసు, మధు,వలి,నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ వెంకటేష్ మృతికి ఘన నివాళులు

విశాలాంధ్ర-గుంతకల్లు : తాడిపత్రి నియోజవర్గం యాడికి మండలంలో ప్రజా సమస్యలపై ప్రభు త్వ వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటాలు చేస్తున్న సిపిఐ మండల కార్యదర్శి కామ్రేడ్ వెంకటేష్ మృతి చెందిన విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్ర స్వామి వారి కుటుంబాన్ని పరామర్శించి అనంతరం ఆయన ప్రార్థివ దేహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఆయన మృతికి రెడ్ సెల్యూట్ చేస్తూ కామ్రేడ్ వెంకటేష్‌కి జోహార్లు తెలిపారు.ఈ సంతా పంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు రాందాస్ ,రాము రాయల్,సిపిఐ నాయకులు గుత్తి షఫీ, గుత్తి రాజు, గుంతకల్లు నాగేంద్ర పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు

విశాలాంధ్ర - రాప్తాడు : మండలంలోని పలు గ్రామాల్లోని రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయమే మంగళ వాయిద్యాలు, గ్రామ పెద్దలు పల్లకీలో స్వామి వారి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్ళి సీతారాములకు మంగళ స్నానాలు చేయించి పట్టువస్త్రాలు కట్టి వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ పండమేటి వెంకటరమణస్వామికి పురోహితులు ఫలపుష్పాలతో అలంకరణ చేశారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఎస్వీవీయూ సభ్యురాలు తోపుదుర్తి నయనతారెడ్డి, తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ పసుపుల హేమావతి, వైసీపీ కన్వీనర్, యూత్ కన్వీనర్లు జూటూరు శేఖర్, చిత్రెడ్డి సత్తిరెడ్డితోపాటు భక్తులు, ప్రజలు హాజరై కోరిన కోరికలు తీర్చే కొంగబంగారం వెంకటరమణస్వామికి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి కాపులైన బండ్లపల్లి గ్రామస్తులు పెద్దఎత్తున హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో జిల్లాస్థాయి రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించారు. ఉరవకొండకు చెందిన వృషభాలు 922.2 అడుగులు లాగగా మొదటి బహుమతి రూ.60వేలు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, గార్లదిన్నె మండలం కృష్ణాపురానికి చెందిన లక్ష్మీరెడ్డి వృషభాలు 926 అడుగులు లాగగా రెండో బహుమతి రూ.50వేలు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, గార్లదిన్నె కు చెందిన రామాంజనేయులు వృషభాలు 662.5 అడుగులు లాగగా మూడో బహుమతి కింద రూ.40వేలు ఎంపీపీ చిత్రెడ్డి జయలక్ష్మి సత్యనారాయణరెడ్డి, ప్యావిలి మండలం పీఆర్ పల్లికి చెందిన సుధాకర్ యాదవ్ వృషభాలు 612.3అడుగులు లాగగా నాలుగో బహుమతి రూ.30వేలు జెడ్పీటీసీ పసుపుల హేమావతి ఆది, గుంతకల్లు మండలం నాగసముద్రం కు చెందిన జి జయరామిరెడ్డి వృషభాలు 315.10 అడుగులు లాగగా ఐదో బహుమతిని రాప్తాడు గంజి రాముడు రూ.20వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గంజి రాముడు ముత్యాల వెంకట రాముడు ఎల్ఐసి వెంకటరాముడు జూటూరు రాజన్న, నారాయణ మారుతీ, చిల్లా నాగరాజు, తలారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - విడపనకల్లు : మండల చీకలగురికి గ్రామంలో ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్సీపీ యువనేత ప్రణయ్ రెడ్డి సహకారంతో గ్రామ వైఎస్సార్సీపీ నాయకులు ఆధ్వర్యంలోగురువారం రైతులకు, యువతకు శ్రీరామ నవమి వేడుక సందర్భంగా గిరుకు బండి పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన మొదటి విజేతగా సుంకప్ప రూ.6,000, రెండవ బహుమతి విజేతగా చిన్న రెడ్డి రూ.3,000,మూడవ బహుమతిగా గదిగే మల్లికార్జున రూ.1,500 రూపాయల నగదును విజేతల కు ఆలయ అర్చకులు వీరయ్య, వైఎస్సార్సీపీ సిపి నాయకులు మర్రి స్వామి, అశోకు, సురేష్, నరసింహులు, గోపి, విద్యా కమిటీ చైర్మన్ ఉమేష్ అందజేశారు.

విశాలాంధ్ర-శింగనమల: మండల కేంద్రంలో వెలసిన ఆత్మా రామస్వామిని శ్రీరామనవమి సందర్భంగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి గురువారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని శింగనమలలో వెలసిన ఆత్మారామ స్వామిని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ సుభిక్షంగా, సుఖశాంతులతో ఉండాలని దేవుని కోరుకున్నాన న్నారు. ఏప్రిల్ 5వ తేది రాత్రి నిర్వహించే సీతారాముల కల్యాణం ఏర్పాట్లపై ఆలయ అర్చకులు, స్థానికులతో చర్చించారు. సీతారాముల కల్యాణానికి ప్రజలందరూ హాజరై దేవుని ఆశీస్సులు పొందాలన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఉరవకొండ : ఉరవకొండ పట్టణంలోని పాతపేట ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామ నవమి వేడుకలను భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు యేళ్ళ ఉమామహేశ్వర్, ట్రెజరర్ గుండారపు వెంకటరమణ, కార్యదర్శి ప్యారం భరత్,అధ్యక్షులు చిన్నపోల వెంకటేశులు,ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఉరవకొండ : ఉరవకొండ మండలం బుధగవి గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని గురు వారం సీతారామ కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా కన్నుల పండువగ జరిగింది. ఆలయ ధర్మకర్త పెద్ద ఆంజనేయ, గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి, ఉప సర్పంచ్ చిన్న ఎర్రి స్వామి, గ్రామ పెద్దలు హనుమంత రాయుడు, ధనుంజయ, బుడ్డప్ప స్వామి, బాలకృష్ణ, అగులూరి రామాంజనేయులు, భీమేష్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - బొమ్మనహళ్ : మండలంలోని రంగాపురం క్యాంపు, ఉద్దేహళ్, బొమ్మనహళ్, కురువల్లి, గోవిందవాడ, నేమకల్లు గ్రామాల్లోని రామాలయం, ఆంజనేయస్వామి ఆలయాలలో గురువారం శ్రీరామనవమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణ వైభవంగా జరిగింది. వందలాది మంది భక్తులు హాజరై వారి మొక్కలు తీర్చుకున్నారు. మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు తనయుడు కాలువ భరత్ హాజరై వారి మొక్కలు తీర్చుకున్నారు. తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండాపురం కేశవరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ బలరాంరెడ్డి, తెలుగు రైతు తాలూకా అధ్యక్షులు ఎర్రగుంట్ల వెంకటేశులు, మాజీ కన్వీనర్ చలపతి, గోవిందు, పయ్యావుల అనిల్, పయ్యావుల మోహన్ బాబు, ఉద్దేహల్ నవీన్, దుర్గ ప్రసాద్, సొల్లాపురం బాబు, నాగరాజు, సైకిల్ షాప్ హనుమంతు, ప్రభాకర్ నాయుడు, శ్యామల, గోరంట్ల వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - విడపనకల్లు : మండలంలోని చీకలగురికి గ్రామాలోని బైల ఆంజనేయ స్వామి ఆలయాలలో గురువారం శ్రీరామనవమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణ వైభవంగా జరిగింది. వందలాది మంది భక్తులు హాజరై వారి మొక్కలు తీర్చుకున్నారు. వైఎస్సార్సీపీ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. మధుసూదన్ రెడ్డి హాజరై వారి మొక్కలు తీర్చుకున్నారు. గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - విడపనకల్లు : మండలం గడేకల్ గ్రామంలో మండల ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్ రెడ్డి దంపతులకు సామాజిక కార్యకర్త పాల్తూర్ ఆనందరాజు, ఎంపిటిసి ఓబులేష్, సిపిఐ నేత చెన్నరాయుడు, ఎస్సీ నేతలు గంగన్న, మారెప్ప తదితరులు వారి నివాసంలో కలుసుకొని శాలువాతో సత్కరించి శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. పాలనలో కొత్త ఒరవడి సృష్టించాలని, సీతారాములు మాదిరిగా ప్రజలకు మరింత సేవ చేయాలని కోరడం జరిగింది.

విశాలాంధ్ర - కూడేరు : శ్రీరామనవమి వేడుకలను మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో గురువారం జరుపుకున్నారు. కరుట్లపల్లి, కొర్రకోడు, కమ్మూరు, కూడేరుగ్రామాల్లో సీతారాముల కళ్యాణం జరిపించి పూజ నిర్వహించారు.

మొక్కజొన్న పంటకు నిప్పు

విశాలాంధ్ర-విడపనకల్లు: మండల పరిధిలోని వేల్పుమడుగు గ్రామంలో గురువారం మొక్కజొన్న పంటకు నిప్పు అంటుకుంది. మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైపోయింది. పంటను అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలాన్ని చేరుకొని మంటలు అదుపు చేశారు. అయినా పంట పూర్తిగా కాలిపోవడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సమీపంలోని జిబిసి కాలువ గట్టు పై ఉన్న గడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పక్కనే ఉన్న మొక్కజోన్న పొలం కు వ్యాపించింది. ఈ ప్రమాదంలో నాలుగు ఎకరాల్లో ఉన్న పంట పూర్తిగా దగ్ధం కాగా రైతు నాగరాజు రెడ్డికి మూడు లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపారు. ప్రభుత్వం నుంచి తమను ఆదుకోవాలని రైతు కోరారు.

కళ్లద్దాల కోసం విద్యార్థుల మధ్య ఘర్షణ?

విశాలాంధ్ర - జెఎన్టియుఏ : జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల (అనంతపురం) డేను గురువారం సాయంత్రం నిర్వహించగా కళ్లద్దాల కోసం విద్యార్థుల మధ్య ఘర్షణ చోటుచేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కళాశాలకు బయట వ్యక్తి కాలేజీ డే కార్యక్రమాన్ని చూడడానికి వచ్చిన వ్యక్తి, విద్యార్థుల మధ్య కళ్లద్దాల కోసం తోపులాట చోటుచేసుకుని అది కాస్త ఘర్షణ వాతావరణం నెలకొన్నది. దీంతో అక్కడ ఏం జరుగుతుందో ఒకసారిగా ఉత్కంఠ నెలకొన్నట్లు తోటి విద్యార్థులు తెలిపారు. గొడవకు పద్ద బయట వ్యక్తి తన అనుచర వ్యక్తులను విద్యార్థులపై పురమాయించడంతో ఘర్షణ మరింత పెరిగే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు నమోదు వరకు వెళ్లడంతో ప్రిన్సిపల్ జోక్యం చేసుకోవడంతో సమస్య సద్దుమణిగినట్లు తెలిసింది. చిన్న ఘర్షణ చోటుచేసుకుంది. ప్రిన్సిపల్ ఆచార్య పి. సుజాత.. కళాశాలలో కళ్లద్దాల కోసం చిన్న ఘటన చోటుచేసుకుంది. సమస్యను పరిష్కరించామని తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

విశాలాంధ్ర - ఉరవకొండ : ఉరవకొండ మండలం షేక్షాన్ పల్లి గ్రామానికి చెందిన మాదిగ రేణుకమ్మ కు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును గురువారం ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి తన స్వగ్రామం కొనకొండ్ల లో బాధితులకు అందజేశారు. అనారోగ్య బారిన పడి ఒక ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవడంతో వారు ఖర్చు చేసిన మొత్తము కొరకు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవ డంతో ముఖ్య మంత్రి సహాయ నిధి నుండి బాధితులకు 1,16,000/- రూపాయలు మంజూరు కావడం జరిగిందని ఎమ్మెల్సీ తెలిపారు.బాధితులు మాట్లాడు తూ ఎమ్మెల్సీ వై. శివ రామిరెడ్డి తమకు సీఎం సహాయనిధి మంజూరు చేయించారనివారు తెలిపారు. ఎమ్మెల్సీకి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-చిలమత్తూరు: మండల పరిధిలోని టేకులోడు గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని మహిత(14) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. విద్యార్థిని మృతికి కారణాలపై విద్యార్థి సంఘం నాయకులు పాఠశాల విద్యార్థినీలతో విచారించారు. ముఖ్యంగా గొంతు నొప్పి అస్వస్థతతో బాధపడుతున్న విద్యార్థిని ఏఎన్ఎంకి చెప్పుకోగ నాటకాలు అడుతున్నావని మందలించిందన్నారు. అనారోగ్యంతో కనీసం శ్వాస తీసుకోవడానికి బాధపడుతున్న విద్యార్థిని తో పిఈటి గ్రౌండ్‌లో 6 రౌండ్లు పరుగులు పెట్టించిందని తెలిపారు. విధ్యార్థిని చావుకి కారణం అయిన ఏఎన్ఎం, పీఈటి, క్లాస్ ఇంచార్జ్ లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ గురుకుల పాఠశాల ముందు ఆందోళన చేపట్టారు. పాఠశాలలో ఇలాంటి నిర్లక్ష్య పరిస్థితులు ఉన్న కనీసం పర్యవేక్షణ లోపంతో వ్యవహరించిన ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశయం తెలుసుకున్న మండల వైద్యాదికారి రామక్రిష్ణ పాఠశాలలో విద్యార్థులకి వైద్యపరిక్షలు నిర్వహించి మెడిసిన్ అందజేశారు. విద్యార్థినలలో అదిక బాగం జలబు, తగ్గు, గొంతు నొప్పితో బాధపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లాఅధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, ఏపి ఎస్ ఎఫ్ నాగభూషన్, ఎంఎస్ ఎఫ్ రవికుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నరసింహమూర్తి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ సభ్యుడు శంకరయ్య, ఏహెచ్ వో ఫౌండేషన్ కో ఫౌండర్ ఎన్ జీవో బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవే తప్పులు పునరావృతం

విశాలాంధ్ర - ఆగళి : గత 15 విడతలగా జరిగిన సామాజిక తనిఖీ తప్పులే పదహార విడత సామాజిక తనిఖీలు మళ్లీ పునరావృతం అయినాయి. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో బుధవారం 16 వ విడత సామాజిక తనిఖీ పై ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా 2021-2022 ఆర్థిక సంవత్సరంలో జరిగిన 359 పనులకు గాను,7.31 కోట్ల రూపాయల ఖర్చు చేసిన వివరాలను డిఆర్పీలు ప్రజావేదికాల్లో చదివి వినిపించారు. ముఖ్యంగా ప్రతి ఏడాది నిర్వహించిన సామాజిక తనిఖీలు వెల్లడవుతున్న తప్పులే పునరావృతం కావడం గమనర్హం. పని ప్రదేశంలో నేమ్ బోర్డు లు ఏర్పాటు చేస్తామని సామాజిక తనిఖీ సమయంలో సిబ్బంది చెప్పడం తర్వాత మర్చిపోవడం పరిపాటిగా మారిందని ఎంపీపీ రేణుక కామరాజు సర్పంచ్ ముద్దరాజు వైస్ ఎంపీపీ గాయత్రి హేమంత్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. 2017 లో మెగా వాటర్ షెడ్ కింద నిర్మించిన పారంపండ్లనే ఉపాధి హామీల కూడా బిల్లులు చేసుకున్నారని వాటిపై పూర్తిస్థాయిలో చేపట్టాలని పిడి రామాంజనేయులను వారు డిమాండ్ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను ఎందుకు తొలగించాలని ఎంపీపీ రేణుకకామరాజ్ డిమాండ్ చేశారు. ఎంపీడీవో నరేంద్ర కుమార్ నుంచి నివేదికను తెప్పించుకొని, 15 రోజుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ పై తగు చర్యలు తీసుకుంటామని పిడి రామాంజనేయులు హామీ ఇచ్చారు. మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీలోను అవెన్యూ ప్లాంటేషన్ బ్లాక్ ప్లాంటేషన్ ఆర్టికల్చర్ కింద నాటిన మొక్కలు పూర్తిస్థాయిలో లేవని పలుచోట్ల మొక్కలే నాటలేదని గ్రామసభలో వివరించారు. పంచాయతీరాజ్ కింద ప్రతి గ్రామపంచాయతీలో పాలసీ తలీకరణ గ్రామ సచివాలయం ఆర్.బికే కు మంజూరైన సిమెంటు క్షేత్రస్థాయిలో నిర్మాణాలు చేపటక సిమెంటు దుర్వినియోగం చేసినట్లు సామాజిక తనిఖీల వెల్లడించిందని వివరించారు.ఉపాధి హామీ పథకం కింద 9153 రూపాయలు 33000 అపరాద రుసుము విధించారు. పంచాయతీ రాజ్ కింద 1598000 రూపాయలు దుర్వినియోగం చేసినట్లు అధికారులు గుర్తించి రికవరీ కి ఆదేశించారు. దుబాయ్ బెంగుళూరు వంటి ప్రాంతాలకు ఉద్యోగాలు చేస్తున్న వారిపేరిట మాస్టర్ రోల్ లో పేర్లు నమోదు చేసి బిల్లులు డ్రా చేసారని హ్యూమన్ రైట్స్ చంద్రభసప్ప అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. డీఈవో రమణారెడ్డి, ఏపీడి జయసింహ, ఎంపీడీవో నరేంద్ర కుమార్, ఏపీవో శివన్న, దివాకర్, శ్రీనాథ్, సతీష్, వెంకటప్ప, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అరుణాచలం పుణ్య క్షేత్రమునకు బస్సులు

విశాలాంధ్ర - ధర్మవరంటౌన్: చైత్రమాస పౌర్ణమిని పురస్కరించుకొని పుణ్యక్షేత్ర మైన అరుణాచలం గిరి కు ప్రదక్షణ చేయు భక్తాదులకు ఏప్రిల్ ఐదవ తేదీ నుండి ప్రత్యేకమైన బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మోతిలాల్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ పెద్దలకు టికెట్టు రూ.1,350లు, పిల్లలకు రూ.700 లు ఉంటుందని, అదే విధంగా రిజర్వేషన్ సౌకర్యం కూడా కలదని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్. .7382860947 ద్వారా సమాచా రాన్ని తెలుసుకొనవచ్చునని వారు తెలిపారు. కావున పట్టణ ప్రజలు, భక్తాదులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సజావుగా జరిగిన నియామకాలు

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో టీ

కనెక్టివిటీ బెంగళూరు వారిచే కళాశాల ప్రాంగణంలో బుధవారం నియామకాలు నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపాల్ జేవి. సురేష్ బాబు, టిపిఓ జెసింత్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ ఈ ప్రాంగణ నియామకాల్లో అనంతపురం, సత్యసాయి జిల్లాలలోని వివిధ పాలిటెక్నిక్ లో చదువుతున్న 120 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగిందని తెలిపారు. ధర్మవరం కళాశాల నుండి కంప్యూటర్ బ్రాంచ్ వారు 15 మంది, ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్ వారు 20 మంది, మడకశిర కళాశాల నుండి ఇద్దరు, కల్యాణదుర్గం కళాశాల నుండి ఒక్కరు ఎంపిక కావడం జరిగిందన్నారు. వీరందరూ వీరి డిప్లమా పూర్తి అయిన తర్వాత, జూలై నెలలో ఉద్యోగంలో చేరడం జరుగుతుందని వారు తెలిపారు. ఎంపిక కాబడిన విద్యార్థులందరికీ కూడా వారు శుభాకాంక్షలు తెలియజేశారు.

సమాజ సేవలో ఎన్ఎస్ఎస్ పాత్ర కీలకం

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: సమాజ సేవలో ఎన్ఎస్ఎస్ పాత్ర కీలకమైనదని,

ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా ముందడుగులో ఉందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోపాల్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా మండల పరిధిలోని గో ట్లురు గ్రామంలో"విద్యతో ఉపాధి లేని యువతపై"ఆరవ రోజు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి, గోపాల్ నాయక్ మాట్లాడుతూ 15 సంవత్సరాల నుండి 29 సంవత్సరాల మధ్య యువతపై సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్యతో ఉపాధి లేని యువతపై అక్కడ ఉన్నటువంటి వారందరికీ కూడా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అనంతరం విద్యతోపాటు సేవా కార్యక్రమాల యొక్క ప్రాధాన్యతను కూడా వివరించడం జరిగిందన్నారు. సర్వే తో పాటు అక్కడ ఉన్నటువంటి యువతకు తగు సందేశాలను, సూచనలను ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఆనందు, రామ్మోహన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

దేవాలయానికి విరాళం

విశాలాంధ్ర-పెనుకొండ: మండల పరిధిలోని కురుబ వాండ్ల పల్లి గ్రామంలో

జరుగుచున్న కొల్లా పురమ్మ దేవాలయం కొరకు రూ.5000 నగదును అందించిన వైస్ ఎంపీపీ 2రామంజినప్ప. ఈ కార్యక్రమంలో డీలర్ మారుతి, నారాయణప్ప, వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

పాదయాత్రలో కియా వద్ద సెల్ఫీ దిగిన నారా లోకేష్

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నియోజకవర్గం గురువారం నాటికి 52వ రోజు 700 కిలోమీటర్లు పూర్తి అయినందున గురువారం ఉదయం విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమై కియా పరిశ్రమ ఎదురుగా యువ నాయకుడు నారా లోకేష్ మొక్కను నాటి సెల్ఫీలు దిగారు. కియా పరిశ్రమ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొరియన్స్ తో మాట్లాడి పరిశ్రమ ఏర్పాటుకు ఎంత కృషి చేస్తారని, శంకుస్థాపనకు ప్రారంభోత్సవానికి మరియు కార్లు మార్కెట్ రంగంలోకి విడుదలైనప్పుడు ఇక్కడికి చంద్రబాబు నాయుడు వచ్చి కార్ల పరిశ్రమ యజమానులతో దిగిన ఫోటోలను చూసి అలాగే కరువు సీమలో కార్లు తయారు పరిశ్రమ ఎలా ఉంటుంది కారణం తెప్పించి క్షుణ్ణంగా పరిశీలించారు. ఆనాటి ప్రభుత్వము ఎంతో గొప్పగా ఆలోచించి కరువు ప్రాంతాన్ని ప్రారంభించడానికి నీటి రంగాన్ని అభివృద్ధి పరిచారని, అదేవిధంగా కరువు సీమలో ఇటువంటి పరిశ్రమలు రావడం సంతోషదగ్గ విషయమని, అలాగే ఎంతో మంది యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు ఉద్యోగ అవకాశాలు కలిగాయని, ఇక్కడ ప్రాంతం యొక్క రూపురేఖలే మారినాయని, పరిశ్రమలు రావడం వలన ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని, ఇటువంటి పరిశ్రమలను రాష్ట్రం నుంచి వెళ్లగొట్టడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కంకణం కట్టుకొని పనిచేస్తున్నారని, ప్రభుత్వము ఏర్పడి నాలుగు సంవత్సరాలు అవుతున్న ఒక్క కొత్త పరిశ్రమ కూడా రాలేదని, పరిశ్రమలకు ఏర్పాటు కావలసిన మౌలిక వసతులు కల్పించడానికి కూడా సరైనటువంటి అవగాహన లేదని ఆయన తెలిపారు. పాదయాత్రలో గుట్టూరు గ్రామం నందు 52వ రోజు 700 కిలోమీటర్ల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అలాగే ఈ శిలాఫలకం నందు పెనుకొండ నియోజకవర్గం, మడకశిర నియోజకవర్గం హంద్రీనీవా కాలువ వలన ఎన్నో గ్రామాలకు నీటి సౌకర్యము కల్పించినందున పెండింగ్ పనులు పూర్తి చేయడానికి ఒక అవగాహన కార్యక్రమంలో ఉంటుందని, అలాగే పెండింగ్ పనులు పూర్తి చేయడానికి గుర్తుగా ఉంటుందని, ఈ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పార్థసారథి మరియు అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బి టి నాయుడు, మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, సవితమ్మ, నిమ్మల కిష్టప్ప, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

లోకేష్ కు ఘన స్వాగతం పలికిన మహిళలు

విశాలాంధ్ర-సికేపల్లి: మండలంలోకి లోకేష్ పాదయాత్ర అడుగుడు తున్న సందర్భంగా జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ కు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి కలశాలతో ఘన స్వాగతం పలికారు. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే పరిటాల సునీత, యువ నాయకుడు శ్రీరామ్ మరియు నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఎదురుగా వెళ్లి స్వాగతం పలికారు. సికె పల్లి సమీపానగల కోన క్రాస్ వద్ద ఏర్పాటుచేసిన విడిది కేంద్రముకు లోకేష్ చేరుకోవడం జరిగింది.

పాదయాత్ర పని వాళ్లకు బట్టల పంపిణీ

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నియోజకవర్గంలో జరుగుతున్న యువ గళం పాదయాత్ర విజయవంతం కావడానికి ప్రజలు మరియు పనివాళ్ళు ఎంతో కష్టపడి పని చేస్తున్నందున గురువారం శ్రీరామనవమి సందర్భాన్ని పురస్కరించుకొని పాదయాత్రలో పని వాళ్లకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సవిత దాదాపు 200 మందికి బట్టలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఎంత కష్టపడి పని చేస్తున్నందున నారా లోకేష్ బాబుకి వెన్నంటి ఉండి ఎటువంటి ఇబ్బంది కలగకుండా పనిలో రాజీకి లేకుండా కష్టపడి పని చేస్తున్నందున వారి శ్రమను గుర్తించి ఒక చిన్న కానుక అందజేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ నియోజకవర్గానికి సంబంధించిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నియోజకవర్గం నందు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేసిన అనేకమంది సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులను గురువారం నారా లోకేష్ పాదయాత్ర విడిది నందు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత అందరిని పేరుపేరునా లోకేష్ కి పరిచయం చేశారు. బుధవారం పార్టీ ఆవిర్భావం రోజున వీరందరిని సన్మానించవలసి ఉన్నది కానీ సన్మానించలేకపోయాము, పార్టీకి ఇదేవిధంగా కష్టపడి పని చేయండి పార్టీ మిమ్మల్ని ఎప్పుడు గుర్తుంచుకుంటుందని అభినందనలు తెలియజేశారు.

పాదయాత్ర ముగింపు

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నియోజకవర్గం నందు గురువారంతో యువ నేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర నేటితో ముగిసింది. గురువారం సాయంత్రం రాప్తాడు నియోజకవర్గంలోని చెన్నె కొత్తపల్లి మండలానికి చేరుకోవడంతో రాప్తాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు లోకేష్ బాబుని సాధారణంగా ఆహ్వానించారు. పెనుకొండ నియోజకవర్గం నాయకులు నియోజకవర్గం నుంచి వేరే నియోజకవర్గం వెళ్లే వరకు పాదయాత్రలో తమ సంఘీభావాన్ని తెలుపుతూ వెళ్లారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బిటి నాయుడు, మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ బీకే పార్థసారధి, సవితమ్మ, ఈరన్న, గుండుమల తిప్పేస్వామి, కృష్ణమూర్తి, మహిళా నేతలు పెద్ద ఎత్తున పాదయాత్రలో పాల్గొన్నారు.

డ్రైనేజీ మురికి నీటితో ప్రజల అవస్థలు

విశాలాంధ్ర-పుట్టపర్తి : మునిసిపాలిటీ పరిధిలోని ప్రశాంతి గ్రామ్ వద్ద

బీడుపల్లి వంకలోకి డ్రైనేజీ నీరు చేరుతోందని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ జిల్లాకార్యవర్గ సభ్యులు బయన్న ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం కలుషిత మురుగునీరు వెళుతున్న వంకను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా బయన్న మాట్లాడుతూ వంకలోకి చేరే మురుగునీరు నేరుగా బుక్కపట్నం చెరువుకు వెళుతున్నాయని పేర్కొన్నారు. ఫలితంగా త్రాగునీటి బోర్లలో ఈ మురుగునీరు చేరి కలుషితమవుతున్నాయన్నారు. ఆ మురుగు నీటి కాలుష్యం వల్ల దోమలు ఉత్పత్తి అవుతున్నాయని దీంతో ప్రజలు అనేక రోగాల బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ మురుగు నీటిని అరికట్టాలని పలుమార్లు మునిసిపల్ అధికారుల దృష్టికి తెచ్చిన ఫలితం ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో మునిసిపాలిటీ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులునాయకులు గౌస్ లాజం, అల్లా బకాష్, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మానవ సేవను అందరూ అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్ : మానవ సేవను ప్రజలందరూ కూడా అలవర్చుకొని, మంచి కి ప్రాధాన్యత కలిగించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నాగరాజు (సాయిరాం) పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ముందు ఆవరణములో శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీరామనవమి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మున్సిపల్ వైస్ చైర్మన్ పెనుజూరి నాగరాజు తొలుత పుట్టపర్తి బాబా, సీతారాముల చిత్రపటాలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. తదుపరి శ్రీరాముని భజనలు, పుట్టపర్తి సత్యసాయిబాబా సంకీర్తనలు, ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం దాదాపు 2000 మంది కి పానకము, వడపప్పును ముఖ్య అతిథి చేత పంపిణీ చేశారు. శ్రీ సత్య సాయి సేవ సమితి నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా దాతల సహాయ సహకారాలతో నడుపుతున్నామని, కొన్ని సంవత్సరాల కిందట శ్రీ సత్య సాయి సేవా సమితి పేరిటతో చలివేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయడం జరిగిందని. ఈ చలివేంద్రం బాటసారులకు విద్యార్థులకు ఎంతగానో దాహార్తిని తీర్చడం పట్ల వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి సేవా సమితి నామా ప్రసాద్, రెడ్డి చంద్ర ,నారాయణస్వామి, చిన్న రెడ్డప్ప, మహేష్, చంద్రశేఖర్,పరంధామయ్య,వెంకటేశులు,నాగరాజు,మహిళలు, పాల్గొన్నారు.

ఏప్రిల్ 3న వైయస్సార్ పింఛన్ పంపిణీ

విశాలాంధ్ర-పుట్టపర్తి : వృద్ధులకు, వికలాంగులకు, వితంతు వంటరి మహిళలకు, ఏప్రిల్ 3న పింఛను పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం సంబంధిత అధికారులకు, వాలంటీర్లకు ఈ విషయమై ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతి నెల 1న పింఛను అందించేవారు, అయితే ఈనెల 31 నుంచి ఏప్రిల్ 2 వరకు సెలవులు ఉండటంతో పింఛన్ పంపిణీ కార్యక్రమం ఏప్రిల్ 3 కు మార్చడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని పింఛనుదారులు అందరికీ తెలపాలని అందులో కోరింది. దీంతో పింఛను లబ్ధిదారులకు ఈసారి ఏప్రిల్ నెల 3న పంపిణీ చేయనున్నారు.

సీతరాముల కళ్యాణం చూద్దాం రారండి

విశాలాంధ్ర - అగళి : శ్రీరామచంద్రుడు ఆదర్శమూర్తి మంచి రాజనీతిజ్ఞుడని కేంద్ర రైల్వే బోర్డు పిఎస్సి మెంబర్ తలుపుల గంగాధర్ పేర్కొన్నారు. పట్టణంలోని సుకన్య క్లినిక్ లో గురువారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీరామ జయంతి వేడుకలను గాయత్రి మాత ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు డాక్టర్ తిప్పేస్వామి, కేంద్ర రైల్వే బోర్డు పిఎస్సీ మెంబర్ తలుపుల గంగాధర్ హాజరైనారు.కిసాన్ మోర్చా రాయలసీమ జోనర్ ఇంచార్జ్ చంద్రశేఖర్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డ రంగే గౌడ్, కిసాన్ మోర్చా కార్యదర్శి చిదానంద నాయుడు, కె ఆర్ వి గుప్తా, మడకశిర మండల అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు, సీనియర్ నాయకులు శ్రీకాంత్, చిన్ని పట్టణ ఉపాధ్యక్షులు భాను దాస్, ప్రభు, అంజి, నాగరాజు, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు మతం లక్ష్మీనారాయణ, ప్రభు మెలవాయి నారాయణప్ప,భక్తాదులు పాల్గొని శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. పాల్గొన్న భక్తులకూడా పెసరపప్పు పానకాన్ని అందించారు.

విశాలాంధ్ర-నల్లమాడ: మండల కేంద్రంలోని గోవేపల్లి, మసక వంకపల్లి, కురుమాల, చౌటకుంటపల్లి ,రెడ్డిపల్లి ,వంకర కుంట, మీసాల వాల్లపల్లి, చారుపల్లి, వేళ్లమద్ది తదితర గ్రామాలలో గురువారం శ్రీరామనవమి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలోని సీతారాముల చిత్రపటాలతో ఊరేగించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పసుపు, కుంకుమ, కాయకర్పూరాలతో భక్తి శ్రద్ధలతో పూజ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విశాలాంధ్ర-కొత్తచెరువు: మండల వ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు రామాలయాలు భక్తుల సందడితో కిక్కిరిశాయి. కొత్తచెరువులో మరువ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న రామాలయంలో స్వామివారికి కళ్యాణోత్సవం నిర్వహించి శ్రీరాముని సీత మూల విరాటను రథములో ఉంచి రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించాలని కోరుతూ గురువారం శ్రీరామనవమి సందర్భంగా హిందూ ఐక్య సంఘాలు, బిజెపి వాటి అనుబంధ సంస్థలు, శ్రీ అభయ హస్త ఆంజనేయ స్వామి సేవా కమిటీ తదితర సంఘాలు, పట్టణంలో బైక్ ర్యాలీతో పాటు, శ్రీరాముని విగ్రహాన్ని పట్టణ పురవీధులలో ఊరేగించారు. పెద్ద ఎత్తున యువతి, యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎక్కడా ఎటువంటి సంఘటనలు జరగకుండా వన్ టౌన్, టూ టౌన్ పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డిష్ రాజు, అన్నం లక్ష్మీనారాయణ, నిరంజన్ కుమార్, హరి, గద్దం కుమార్, చిన్నూరు సోము, రుద్ర రవికుమార్ తోపాటు వందలాదిమంది ఐక్య హిందూ సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ధర్మవరంటౌన్ : పట్టణంలోని తేరు బజార్లో గల వాసవి కళ్యాణ మండపం కొత్త సత్రమునందు గురువారము నాడు శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా భారతీయ సంస్కృతి సాంప్రదాయాల నడుమ ఆర్యవైశ్యులు నిర్వహించుకున్నారు. ఉభయ దాతలుగా వసంత లక్ష్మి,కలవల బద్రి నారాయణ గుప్తా-శ్వేతా స్టీల్ సెంటర్- ధర్మవరం వారు నిర్వహించారు. పురోహితులు నారాయణమూర్తి, చంద్రశేఖర్ శర్మ, జయసింహ లు, వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ, వందలాది భక్తాదులు నడుమ అత్యంత వైభవంగా ఈ కళ్యాణ మహోత్సవ వేడుకలను జరిపారు.ఆర్యవైశ్య సంఘము, వాటి అనుబంధ సంస్థ సంఘం, అల్వాల శ్వేత, అల్వాల సందీప్ ,అల్వాల అని, అన్విత, కలవల కృష్ణ తేజ, కలవల వెంకట్, అఖిల్, తదితర కుటుంబ సభ్యులు, ఆర్యవైశ్య తదితర భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విశాలాంధ్ర - బత్తలపల్లి : కల్యాణము చూద్దాము రారండి సీతారాముల కల్యాణము చూద్దాము రారండి అంటూ భక్తులు దేవదేవుని సీతారాముని కళ్యాణాన్ని తిలకించారు. మండలం పరిధిలోని గుమ్మలకుంట గ్రామంలో ఉన్న సీతారాముల కల్యాణాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అలాగే మండలం పరిధిలోని పోట్లమర్రి గ్రామంలో ఉన్న సీతారామాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా బత్తలపల్లి ఎస్సై శ్రీ హర్ష ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

విశాలాంధ్ర - లేపాక్షి : మండలంలోని పులమతి ఆంజనేయస్వామి దేవాలయంలో వెలసిన సీతారాముల బ్రహ్మ రథోత్సవం గురువారం మధ్యాహ్నం అత్యంత వైభవంగా సాగింది. సీతారాముల రథోత్సవంను గ్రామ పెద్దలు, గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు ఊరేగింపు చేసారు. ఈ కార్యక్రమంకు గ్రామ సర్పంచ్ అశ్వత్థనారాయణ, ఎంపిటిసి సభ్యురాలు నాగజ్యోతితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - పుట్టపర్తి : శ్రీరాములు పుట్టినరోజు సందర్భంగా ప్రశాంతి నిలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాలు లో సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ ఆధ్వర్యంలో వేద పండితులు సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పుట్టపర్తి, ఎనుములపల్లి గ్రామాల్లో ప్రజలు ఆనందోత్సవంగా తిలకించారు. మున్సిపల్ పరిధిలోని గ్రామాలలో శ్రీరాముల గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విశాలంధ్ర -బుక్కపట్నం: శ్రీరామనవమి పురస్కరించుకొని శ్రీరామనవమి వేడుకలు భక్తులు అత్యంత వైభవంగా నిర్వహించుకొని శ్రీరామ దేవాలయాల వద్ద పానకాలను పంపిణీ చేశారు. మండల కేంద్రంలో వేడుకలను ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి వేడుకలను ఘనంగా ఘనంగా నిర్వహించారు పురాతనమైన రామస్వామి ఆలయ గుడి పుననిర్మాణానికి విరాళాలు సేకరించగా గ్రామానికి చెందిన దాతలు పెనుజురి లక్ష్మయ్య, రాజు తమ వంతు సహాయంగా 50 వేల రూపాయలను శ్రీరామ సేవా సమితి ట్రస్టు అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్ కు శ్రీరామ నవమి పర్వదినాన అందించారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ దాదాపు కోటి రూపాయల వ్యయంతో నూతన ఆలయాన్ని నిర్మించేందుకు సేవా సమితి ట్రస్ట్ ముందుకొచ్చిందని దాతలు తమ వంతు సాయం చేసి గుడి పునర్నిర్మాణంలో పాలుపంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సేవా ట్రస్ట్ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.